క్లుప్తంగా

108 అడుగుల గణనాథుడిని దర్శించుకున్న ఎంపీ



దొండపర్తిలో 108 అడుగుల గణనాథుడి సన్నిధిలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

సీతమ్మధార : వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 108 అడుగుల భారీ గణనాథుడిని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ బుధవారం దర్శించుకున్నారు. జీవీఎంసీ 27వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి బృందం ఆధ్వర్యంలో దొండపర్తి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ భారీ గణనాథుడికి ఎంపీ ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

రెజ్లింగ్‌లో సత్తా చాటిన విద్యార్థినులు



బహుమతులు గెలుచుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి తదితరులు

అల్లిపురం : ఈ నెల 23, 24 తేదీల్లో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 3వ ఏపీ రాష్ట్ర సీనియర్ మెన్ అండ్ ఉమెన్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్-2023లో సౌత్ జైలురోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి తెలిపారు. ఈ పోటీల్లో నాలుగు గోల్డ్, నాలుగు సిల్వర్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమెతో పాటు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జ్యోతి పతకాలు గెలుచుకున్న వారిని అభినందించారు.

తల్లి మృతదేహం పిల్లలకు అప్పగింత



తల్లి మృతదేహాన్ని కుమారుడు, కుమార్తెలకు అప్పగిస్తున్న వసతిగృహ ప్రతినిధులు

అల్లిపురం : కన్నతల్లి బ్రతికుండగా పట్టించుకోని పిల్లలు ఆమెను రోడ్డు మీద వదిలేశారు. ఏయూటీడీ జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహం ప్రతినిధులు ఆ అనాథ మహిళకు ఆశ్రయం కల్పించారు. అప్పటి నుంచి ఆమెకు చికిత్స అందజేస్తున్నారు. ఆమె బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మరణించింది. దీంతో ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ మేనేజర్ జ్యోతిర్మయి ఆమె కుమార్తెకు సమాచారం అందించారు. దీంతో ఆమె కుమార్తె మంగవేణి, కుమారుడు ఈశ్వరరావు నిరాశ్రయ వసతి గృహానికి చేరుకున్నారు. వారికి వారి తల్లి మృతదేహాన్ని అప్పగించారు.

అన్నదానాలు.. ప్రత్యేక పూజలు



రామజోగిపేటలో అన్నదానం చేస్తున్న మన్యాల శ్రీను



చిలకపేటలో భక్తులకు వడ్డిస్తున్న కొల్లి సింహాచలం తదితరులు

- సేవా కార్యక్రమాల్లో తరిస్తున్న యువత
- గణపతి సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి

అల్లిపురం : నియోజకవర్గంలో విస్తృతంగా అన్నసమారాధనలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. యువత ఏడాదంతా ఎలా తిరిగినా వినాయక చవితి వచ్చే సరికి అంతా ఐకమత్యంగా కలిసిపోతారు. బొజ్జగణపయ్య ఉత్సవాలు చేసేందుకు ఉత్సాహం చూపిస్తారు. వారి భక్తిని పెద్దలు కూడా ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ఉత్సవాల పేరుతో తొమ్మిది రోజులు ఏదో ఒక చోట అన్నసమారాధనలు నిర్వహించి పేదల కడుపు నింపుతున్నారు. వినాయకునికి ఇష్టమైన రోజు బుధవారం కావటంతో నగరంలో పలు గణపతి మండపాల్లో అన్నసమారాధనలు చేపట్టారు.

28వ వార్డులో..

పందిమెట్ట యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొని ప్రారంభించారు.

29వ వార్డులో..

భారతి ఆస్పత్రి వద్ద, రామజోగిపేట, శ్రీ బాల గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మన్యాల శ్రీనివాస్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఏఎస్ బీచ్ ఆస్పత్రి వద్ద యూత్ బాయ్స్ నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గ, రాపాక శ్రీనివాసరావు, కట్టా శ్రీనివాస్, దొగ్గ రమణ, నడుపూరి రాజు పాల్గొన్నారు.



గౌరీవీధి అన్నసమారాధనలో పాల్గొన్న బొడ్డేటి ప్రసాద్, కర్రి నీలకంఠం

33వ వార్డులో..

గౌరీవీధిలో నాటుకుర్రోళ్ల ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, మండల కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సక్రమ మార్గంలో నడిచేందుకు ఉత్సవాలు దోహదపడతాయన్నారు. మన సంస్కృతిని దశదిశలా వ్యాపింపజేసేది యువత అని కొనియాడారు. సమాజ సేవతో పాటు దైవ సేవలో యువత ముందుండటం ఆనందదాయకమని వారు తెలిపారు.

39వ వార్డులో..

చిలకపేటలో కెచ్చాలి బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.



భక్తులకు వడ్డన చేస్తున్న కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ రమణమూర్తి

కళా ఆస్పత్రి ఆవరణలో..

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ ఐదవ లైన్‌లోని కళా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి మాట్లాడుతూ వృత్తితో పాటు నేటి యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని అన్నారు. మహా గణపతిని పూజించడం వలన విఘ్నాలు తొలగిపోతాయని అన్నారు. అన్నసమారాధనకు భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతో విజయం తథ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆచార్యులు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

- ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్

అల్లిపురం : విద్యార్థులు తమ భవిష్యత్‌కు సంబంధించిన ప్రణాళికలు ముందుగానే ఏర్పరచుకోవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ సూచించారు. డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో బుధవారం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగంలోకి వెళ్లాలనుకుంటున్నారో ముందుగానే నిర్ణయించుకుంటే విజయం సులభం అవుతుందని తెలిపారు. ముఖ్యంగా సమాజ స్పృహ, సమాజాభివృద్ధికి వారు తోడ్పడాలన్నారు. అందుకు తగిన రంగాలను ఎంచుకోవడంలో ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు ఎస్ఏడీ పాల్, త్రినాథరావు, సులేమాన్, రామకృష్ణ, ఎంజీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, కర్రి నీలకంఠం, బోణి దేవ, కణితి బ్రహ్మం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవపై విస్తృత ప్రచారం



అవగాహన కలిగిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్గదర్శకత్వంలో వివిధ ఆరోగ్య సంరక్షణ పథకాల గురించి అవగాహన కల్పించేందుకు ఆయుష్మాన్‌భవ ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఆధ్వర్యంలో అధ్యాపకులు, వైద్య విద్యార్థుల నుంచి అవయవ దానంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం ఆవయవ దానం ద్వారా జీవితాన్ని ప్రసాదించడం, ఒక దాత 8 మంది ప్రాణాలను రక్షించగలడు అన్న అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిజ్ఞ చేసి నమోదు చేసుకున్న అధ్యాపకులు సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆసక్తి గలవారు www. notto. mohfw. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించి వివరాలు నమోదు చేసుకోవచ్చు.

ఉత్కంఠభరితంగా టెన్నికాయిట్ పోటీలు



టెన్నికాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పీఎస్‌రాజు



పోటాపోటీగా తలపడుతున్న క్రీడాకారులు

- 300 మంది క్రీడాకారుల హాజరు
- అండర్ 14, 17 విభాగాల్లో ఎంపికలు

పరవాడ/అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు, ఎంపికలు పరవాడ మండలం పెద ముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం చేపట్టారు. ఈ పోటీల్లో 15 నియోజకవర్గాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 17 (బాలురు, బాలికలు) విభాగాల్లో పోటీలు నిర్వహించి ఎంపికలు చేపట్టారు. పోటీలను ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు (పీఎస్‌రాజు) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. అందుకు తగ్గట్టుగా క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. రాష్ట్ర జట్టులో తలపడనున్న జట్లను కూడా ఎంపిక చేశారు. వీరికి క్రీడా దుస్తులకు గ్రామ సర్పంచ్ నాగమణి, ఆమె కుమారుడు కబడ్డీ అప్పారావు రూ.10 వేల నగదు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు దివాకర్, గొంతిన సాయి శైలజ, పాఠశాల హెచ్ఎం కె.కృష్ణ, గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, కబడ్డీ అప్పారావు, అనకాపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, పాఠశాల పీడీ ఎస్.వి.రమణ, వైఎస్ ఎంపీపీ బూస అప్పలరాజు, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ రవిబాబు పాల్గొని బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ పెద్దినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.ఎం.నాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ దాలిబోయిన పైడిరాజు, సభ్యులు కె.సత్యనారాయణ, వై.బుజ్జి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం

అల్లిపురం : పరిసరాల పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి అన్నారు. స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు బుధవారం నిర్వహించిన శుభ్రత, పరిశుభ్రత ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె. గీతాంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

మహారాణిపేట : మద్రిపాలెం జాతీయ రహదారి వద్ద ఉన్న శారదావేలీ డెవలప్‌మెంట్ సమితి (ఎస్‌వీడీఎస్)ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ విభాగం అడిషనల్ డైరెక్టర్ చిన్మయిదాస్, అడిషనల్ పీడీ కోటేశ్వరి సందర్శించారు. ఇక్కడున్న ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాల గురించి ఆరా తీశారు. హెచ్ఐవీపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా టైలరింగ్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కోటేశ్వరి సర్టిఫికెట్లు అందజేశారు.

కౌమారదశలో ఆరోగ్య పరిరక్షణ తప్పనిసరి



వర్క్‌షాపులో పాల్గొన్న వైద్యులు, విద్యార్థినులు

మహారాణిపేట : కౌమార దశలో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం ప్రభుత్వ వైద్య-ఆరోగ్య శాఖ, రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా వర్క్‌షాప్ నిర్వహించారు. నగరంలోని ఒక హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్‌మిషన్ స్టేట్ ప్రొగ్రామ్ మేనేజర్ డాక్టర్ వెంకట రవికిరణ్, ఏపీ సొసైటీ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ జిల్లా ప్రొగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.రాజేంద్రప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తదితరులు ప్రసంగించారు. కౌమార దశలో బాలికల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే స్టేట్ ప్రొగ్రామ్ అధికారి డాక్టర్ నిర్మల గ్లోరీ, నేషనల్ కన్సల్టెంట్ డాక్టర్ మునిరాజ్, ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.వి. సమత, పలువురు ప్రొగ్రామ్ అధికారులు డాక్టర్ పి.రవికుమార్, కిరణ్‌దేశాయ్, డాక్టర్ హీనా దీక్షిత్, డాక్టర్ మృదుల, వై.కిషోర్, డాక్టర్ సాలిమా భాటియా, డాక్టర్ శ్రీలత, డాక్టర్ విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



ఉత్సవాలు నిర్వహిస్తున్న వేద పండితులు

అల్లిపురం : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం నుండి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పవిత్ర అవరోహణం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. దేవస్థానం వేద పండితులు, అర్చక స్వాముల పర్యవేక్షణలో పెదపూడి రఘురామాచార్యులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్మన్ కె.సింహాచలం, ధర్మకర్తలు బోదిలపాటి సత్యరూపవాణి, ఎం.ధనలత, బి.వెంకటరత్నం, ఎస్ఏఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్.సురేష్, జి.ప్రకాష్, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యా ప్రదాత ఇంద్రాణి జగ్గారావు



మాట్లాడుతున్న మిసెస్ ఏవీఎన్ కళాశాల వైస్ చైర్మన్, కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు

అల్లిపురం : విద్యా రంగానికి వన్నె తెచ్చిన చరిత్ర ఇంద్రాణి జగ్గారావుది అని మిసెస్ ఏవీఎన్ కళాశాల వైస్ చైర్మన్, కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు అన్నారు. కళాశాల పూర్వ కరస్పాండెంట్, వైస్ చైర్‌పర్సన్ ఇంద్రాణి జగ్గారావు 89వ జయంతి బుధవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముందుగా ఇంద్రాణి జగ్గారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచం నలుమూలలా ఏవీఎన్ కళాశాల విద్యార్థులు ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని, ఈ కళాశాలను అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు తన తల్లి ఇంద్రాణి జగ్గారావు సేవలందించారన్నారు. బాలికల విద్య కోసం ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. లోక్ అదాలత్ రాష్ట్ర సభ్యురాలిగా ఎన్నో వివాదాస్పదమైన అంశాల్ని పరిష్కరించడంతో పాటు వరకట్న నిర్మూలనకు కృషి చేశారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ ఫిజిక్స్ లెక్చరర్ శ్రీనివాసరావు సిరికి, కళాశాల డీన్ శంకర్ నారాయణ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మురళి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు లెక్చరర్‌కు అభినందనలు



ఆచార్య ఎన్‌వీ పద్మకుమారిని సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, ఆచార్యులు

అల్లిపురం : ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల తెలుగు లెక్చరర్ ఎన్‌వీ పద్మకుమారికి డాక్టరేట్ లభించినందుకు గాను కళాశాల సమావేశ మందిరంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి, ఆచార్యులు ఆమెను అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అడిగోపుల వెంకటరత్నం రచనలు, పరిశీలన అనే అంశంపై ఎన్‌వీ పద్మకుమారి ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ పట్టా పొందారని తెలిపారు. యూజీసీ నెట్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత సాధించి తన ప్రతిభతో పీహెచ్‌డీ పొందడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ ఆత్మీయ సన్మాన సభలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 10 భోజనానికి 175 రోజులు



రోగుల బంధువులకు భోజనం పంపిణీ చేస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి రోగులు, వారి సహాయకులకు విజయవంతంగా 175 రోజుల పాటు రూ. 10కే భోజనం అందజేసిన ఘనత శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ కొనియాడారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో భోజనాల పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన, రుచికరమైన భోజనం పది రూపాయలకే అందించడం మంచి పరిణామమన్నారు. భోజనాల పంపిణీ కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొదిలపాటి ఉమామహేశ్వరరావు, శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు బందారు గణపతి స్వామి, కోట రమేష్, సీహెచ్ వెంకటేశ్వరరావు, గురువులు, బాబ్జీ, కస్తూరి, ద్రోణంరాజు శ్రీనివాస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో అడ్వాన్స్ రూట్‌కెనాల్ శిక్షణ



కేజీహెచ్ డెంటల్ విభాగంలో శిక్షణ ఇస్తున్న డాక్టర్ సంధ్యారాణి

మహారాణిపేట : కేజీహెచ్ డెంటల్ సర్జరీ విభాగంలో రెండు రోజుల రీసెంట్ అడ్వాన్స్ ఇన్ రూట్‌కెనాల్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ తరగతులకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ కె.సంధ్యారాణి వైద్యులకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అనకాపల్లి, నర్సీపట్నం, భీమిలి, పెందుర్తి, గోపాలపట్నం తదితర ప్రాంతాల నుంచి 30 మంది డెంటల్ వైద్యులు పాల్గొన్నారు. డెంటల్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ డి.ఎల్.త్రివేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ లావణ్య, డాక్టర్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ నిర్ణయం చారిత్రాత్మకం



మాట్లాడుతున్న రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

తాటిచెట్లపాలెం: కులాల ప్రాతిపదికన జనగణన చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత అన్నారు. నరసింహనగర్‌లోని ఆమె కార్యాలయంలో బుధవారం నగరంలోని పలు నియోజకవర్గాల యాత ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ కుల ప్రాతిపదికన జనగణన జరగాలని స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అనేక ప్రజా సంఘాలు పోరాటాలు చేస్తున్నా.. ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ముందుంటుందని తెలిపేందుకు ఈ నిర్ణయమే సాక్ష్యమని పేర్కొన్నారు. కులగణన జరిగినప్పుడు రిజర్వేషన్ల అమలు తీరు ఏ మేరకు ఉందన్న విషయంపై స్పష్టత వస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు, యాత నాయకులు బసరమాని లక్ష్మణరావు, గొడ్డి కన్నారావు, బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, వడిశెల సూరిబాబు, సిమ్మా గోవిందరావు, వనుం లోకేష్, పిల్లి సంతోష్‌కృష్ణ, పిల్లి కన్నారావు, పిల్లి రాజా రాఘవేంద్ర, లొట్ల వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రామిక్ కాంగ్రెస్ సర్వసభ్య సమావేశాలు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని ఆశీర్వాద్ కల్యాణ మండపంలో మంగళవారం ప్రారంభమైన ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ద్వైవార్షిక సర్వసభ్య సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పలు తీర్మానాలు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో 8 వేల నుంచి 9 వేల మంది ఉద్యోగుల కొరత ఉందని, వెంటనే వీటిని భర్తీ చేయాలనన్నారు. రైల్వే జోన్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న సిబ్బంది క్వార్టర్స్‌ను వెంటనే తొలగించి కొత్తవి నిర్మించాలని తీర్మానించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె.సంపత్‌కుమార్, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి.మౌళీశ్వరరావు, శ్రామిక్ కాంగ్రెస్ పరిధిలోని ఆయా బ్రాంచ్‌ల కేంద్ర కార్యవర్గ సభ్యులు, కార్యదర్శులు, ప్రతినిధులు, జనరల్ కౌన్సిల్ సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.